# అద్దం పట్టిన కథ

'విపంచి'

**చాలా మందికుండే** ఉబలాటమే చంటి బాబుకి కల్గింది- అది అచ్చులో తన పేరు చూసుకోవాలని.

అసలు చంటి బాబుకి పేపర్లు, పత్రికలు వంటి అనవ్యాకరమైన వాటిని (అతడి దృష్టిలో) చదివే చెడ్డ అలవాటు లేదు.

కాని ఇంత హఠాత్తుగా అచ్చు ఉబలాటం పుట్టడానికి ఓ ఫ్లాష్ బ్యాక్ ఉంది-

ఆ రోజు సాయంత్రం...

నాలుగు గంటలకి గడియారం "టక్- టక్" మని వేగంగా కొట్టుకుంటూంది, చంటి బాబు గుండెలా.

ఎదురుగా తల దించుకుని, ఓరచూపులు విసుర్తూంది అందమైన ఆడ పిల్ల పద్మిని.

ఆమె ప్రక్కనున్న ఆడవాళ్ళు నంతలో గేదెనో, లేక ఏ చింతవండునో చూస్తున్నట్లు చంటిబాబుని పరీక్షగా చూస్తున్నారు.

"అమ్మాయిని చూడు!" చంటి బాబు చెవిని వాళ్ళ అన్నయ్య కొరికాడు.

"అబ్బా!" చిన్నగా విసుక్కున్నాడు చంటిబాబు.

అప్పటికి ఆ గదికి ఎన్ని దూలాలున్నాయో లెక్కపెట్టడం అయింది.

ఎదురుగా టేబిల్ మీద పెట్టిన మిక్చర్ ప్లేట్లన్నీ కడుపులోకి వెళ్ళిపోయాయి.

'కిటికీ ఊచలు, గోడ క్యాలెండర్లు కావేవీ లెక్కకనర్హం' అన్నట్లు వాటినన్నింటినీ లెక్కపెట్టేశాడు చంటిబాబు.

ఇక ఏం చేయ్యాలో తోచలేదు.

పెళ్ళి చూపుల కొచ్చి టిఫిన్, టీలు పుచ్చేసుకుని ఆ అమ్మాయికే°స ఓ 'లుక్కయినా' విసరకపోవడం బొత్తిగా బావుండదని మనసులో కొన్ని వదుల టన్నుల ధైర్యాన్ని తెచ్చుకుని పద్మినికే°స చూశాడు చంటిబాబు.

పద్మిని ఓర చూపులో కరెంట్ పాసై చంటిబాబుకి షాక్ కొట్టింది.

"ఏదైనా అడుగుతావేమో అడుగు, బాబూ, అమ్మాయిని." ఒక పెద్దావిడ చంటిబాబుతో చెప్పింది.

చాలా సేపు °సరియ°సగా ఆలోచించాడు చంటిబాబు- 'ప్రధాని పేరు అడుగుదామా? ముఖ్య మంత్రి పేరు అడుగుదామా?' అనుకున్నాడు.

కాని అవన్నీ బొత్తిగా బఫూన్ వేషాలైపోతాయని అనుమానమే°సంది.

"బి. ఎ °స °స.లో మీది ఎకనమిక్స్ మెయినా, కా°స్టంగ్ మెయినా?" ఏదో ఒకటి అడగకపోతే బావుండదని అడిగేశాడు.

కిసుక్కున నవ్వింది పద్మిని.

చంటిబాబు అన్నయ్య చంటిబాబు కాలిని గట్టిగా తొక్కాడు.

'అమ్మోయ్... కెవ్వ్వ్ కెవ్' అని కేకేద్దామనుకున్నాడు.

అందమైన ఆడపిల్లల ఎదుట పాము కాటే°సనా అరవకూడదని, అరి స్తే పిరికి వాళ్ళమైపోతామని మిత్రుడు చెప్పిన థీరీ గుర్తుకొచ్చి ఆ ఉద్దేశాన్ని విరమించుకున్నాడు.

వీళ్ళందరి ముందూ తనేమీ మాట్లాడలేడని బాగా అర్థమైపోయింది చంటిబాబుకి.

"నాకు పర్సనల్ ఇంటర్వ్యూ కావాలి! అడుగు, అన్నయ్యా!" అన్నయ్య దగ్గర గొణిగాడు చంటిబాబు.

"మరీ పిరికి నన్నా°సవి! ఆ అమ్మాయితో ఒంటరిగా ఏం మాట్లాడుతావు! భయపడతావురా, చంటీ!" భయపెట్టాడు అన్నయ్య.

చంటికే°స గుర్రుమని చూస్తున్నాడు వాళ్ళ నాన్న, కళ్ళ జోడులో నుండి.

"నాకేం భయం?" చంటిబాబు మేకపోతు గాంభీర్యం చూపాడు.

చివరికి ఎలాగైతేనేం పద్మినితో పర్సనల్ ఇంటర్వ్యూ దొరికింది చంటిబాబుకి.


అప్పుడు పేల్చింది పద్మిని ఆ బాంబుని-

"మీరు 'ప్రేమ గోదాట్లో పెద్దల తిమింగలాలు నవల చదివారా?" ఆసక్తిగా అడిగింది పద్మిని.

బిక్కమొహమేశాడు చంటిబాబు.

అప్పటి కిలా బిక్కమొహం వెయ్యడం ఎన్నోసారో గుర్తు లేదు చంటిబాబుకి,

"నాకు సాహిత్యం అంటే మహా సరదా లెండి



వచ్చిన ప్రతి పుస్తకం కొనుక్కోవాలని నా ఆశ. పెళ్ళయ్యాక నా ఆశని తీరుస్తారుగా మీరు?"

గుండె గుభేలుమనటమంటే ఏమిటో తెలిసొచ్చింది చంటిబాబుకి.

"మీది కనీసం ఓ కవితైనా,, కథైనా ప్రింటయిందా?"

'బుద్ధి తక్కువై పర్సనల్ ఇంటర్వ్యూ అడిగాను రా, దేవుడా!' మనసులోనే తనని తాను కసిగా తిట్టుకున్నాడు చంటిబాబు.

"అసలు వ్రాస్తే గదా ప్రింటవడానికి - ఇహిహి!" తన ప్రియాతి ప్రియమైన పద్మిని కోరిక తీర్చలేకపోతున్నందుకు హృదయంలో ఏడుస్తూ పైకి పళ్ళికిలించాడు.

"బావోలేదండీ, చంటిబాబు గారూ, మీ పద్ధతి! వీధి వీధికి ఓ రచయిత వెలుస్తున్న ఈ రోజుల్లో ... మీ రిలా ..." నాలిక చప్పరించేసింది పద్మిని.

"కనీసం ఓ ఉత్తరమయినా అచ్చయిన వాడినే చేసుకోవాలని నా చిరకాల వాంఛ! పోనీ, మీవెన్ని ప్రింటయాయి ఉత్తరాలు?"

"హి హి హి... ఉత్తరాలు... ఆ ఉత్తర రచయితలందరూ ఉత్త భజనపరులండీ, పద్మిని గారూ! నా కదేం అలవాటు లేదు." చెప్పాడు చంటిబాబు.

"అది కాదు! మన పెళ్ళయే లోపల మీది ఒక ఉత్తరమైనా పడాలి. అది నా కోరిక." 'ఆజ్ఞ' అన్నట్లు చెప్పింది పద్మిని.

ఇదంతా ఫ్లాష్ బ్యాక్...

అది గుర్తుకొచ్చింది చంటిబాబుకి.

అప్పటి కా సంఘటన జరిగి వారం రోజులు అయింది.

ఇరు పక్షాలకి ఇష్టమైంది ఆ సంబంధం.

ముహూర్తం పెట్టడానికి తొందరపడసాగారు.

ఈలోగా పద్మిని ముద్దుకోర్కె తీర్చెయ్యాలని (ఉత్తరం అచ్చు కావాలని) గట్టిగా తీర్మానం చేసుకున్నాడు చంటిబాబు.

నీట్‌గా డ్రెస్ చేసుకుని లైబ్రరీకి బయల్దేరాడు.

లైబ్రరీలోని జనాలందరూ కళ్ళు తమ చేతుల్లోని పుస్తకాల కప్పగించేసి, సీరియస్‌గా చదివేస్తున్నారు.

ఆ వాతావరణం చంటిబాబుకి కొత్తగా, చెత్తగా ఉంది.

తన ప్రక్కన కూర్చున్న వ్యక్తి ఏం చదువుతున్నాడో అని చూశాడు.

"మీరే నా మొగుడు" సీరియల్ యమ సీరియస్‌గా చదివేస్తున్నా డతగాడు.

ఆ సీరియల్ నవల మీద ఉత్తరం వ్రాయాలని ఓ నిర్ణయాని కొచ్చాడు చంటిబాబు.

'ఏమని వ్రాయాలి?' ఆలోచనలో పడ్డాడు.

'మీ (మా) పత్రికకే హైలెట్' అని వ్రాసే రోజులు పోయాయి. కొత్త రకంగా వ్రాయాలి-' మెరుపులా మెరిసింది ఒక ఆలోచన.

వెంటనే దానిని అమలులో పెట్టేశాడు చంటిబాబు.

సీరియల్‌లో ఓ అక్షరం ముక్క కూడా చదవకుండానే ఉత్తరాల శీర్షికకి వ్రాశాడు.

"మీరే నా మొగుడు" సీరియల్ నవల నా జీవితానికి అద్దం పట్టింది. అందులో కథా నాయకుడి పాత్ర నన్ను చూసే రచయిత వ్రాశారేమో అన్నంత అద్భుతంగా చిత్రించారు.

ఇటువంటి సీరియల్స్ మీ, మా మన పత్రిక్కి ప్రాణాలు. మీకు నా అభినందనలు.

-పండు వీర వెంకట
సత్య నాగమల్లేశ్వరరావు
(చంటిబాబు)
ముదునూరుపాడు
(వయా) తాడేపల్లిగూడెం."

చంటిబాబు, పద్మినిల వివాహానికి ముహూర్తం పెట్టేశారు.

చంటిబాబు పంపించిన రెండు వారాలకే ఆ ఉత్తరం అచ్చయింది. ఒక్క ముద్రారాక్షసం కూడా లేకుండా చంటిబాబు వ్రాసింది 'తు.చ.' తప్పకుండా ప్రింట్ చేశారు.

ఆ ఉత్తరం పడ్డ (ప్రచురించబడ్డ) రోజు చంటిబాబు ఓ పది పుస్తకాల వరకూ కొనేశాడు.

పద్మినికి స్పెషల్‌గా పోస్టు చేశాడు.

'తన పద్మిని ముద్దు చెల్లించగలిగాడు. బదులుగా తన డార్లింగ్ ముద్దులిస్తుందేమో?' కలలు కనసాగాడు చంటిబాబు.

కాలరెత్తుకుని పోజులు కొట్టసాగాడు.

ఉన్నట్లుండి పెళ్ళింకా పదిహేను రోజులు ఉందనగా పద్మిని వాళ్ళ దగ్గర్నుండి ఓ ఉత్తరం వచ్చింది-చంటిబాబు సంబంధం ఇష్టం లేదని, పెళ్ళికాక ముందే 'నిజం' తెలిసినందువల్ల వాళ్ళ అమ్మాయి గొంతు కోయబడకుండా కాపాడుకోగలిగామని.

ఆ 'నిజం' ఏమిటో బుర్ర బద్దలు కొట్టుకున్నప్పటికీ అర్థం కాలేదు చంటిబాబుకి.

'పద్మిని కోర్కె తీర్చాడు. ముహూర్తం పెట్టిన తరువాత ఈ గొడవేమిటి?' డైలమాలో పడిపోయాడు.

అతడి సందేహాన్ని వాళ్ళ అన్నయ్య ఆ రోజు సాయంత్రం తీర్చాడు.

"వెధవా! అడ్డగాడిదా... తిని కూర్చోలేవూ?" ఇంట్లోకి వచ్చి రాగానే 'గయ్' మని లేచాడు చంటిబాబు అన్నయ్య.

"దార్లో పిచ్చి కుక్క గాని కరవలేదు గదా?" భోరుమని ఏడ్చెయ్యడానికి సిద్ధమైపోతూ అడిగేశాడు చంటిబాబు.

పళ్ళు పటపటా కొరికాడు అన్నయ్య. "నన్ను కాదు... పిచ్చి కుక్క కరిచింది నిన్ను!

లేకపోతే ఆ ఉత్తరమేమిటి?

ఆ దరిద్ర గొట్టు నవల నీ జీవితానికి అద్దమా?

అఘోరించు వ్రాసుకున్నదానికి!

ఇక జన్మలో నీకు పెళ్ళి సంబంధాలు రావు!!!" వరసగా స్టేట్‌మెంట్లు ఇచ్చేశాడు చంటిబాబు వాళ్ళ అన్నయ్య.

ఆ ఆఖరి ముక్క వినగానే హార్ట్ ఎటాకొచ్చినంత పనయింది చంటిబాబుకి.

"అదేమిటి?" ఏడుపు గొంతుతో అడిగాడు.

"అసలు నువ్వా నవల చదివావా?"

"ఊహూఁ!" తల అడ్డంగా ఆడించాడు చంటిబాబు.

"ఠాప్!"

చంటిబాబు చెంప పేలిపోయింది.

పెళ్ళి భోజనాల్లో వడ్డించే బూరెల్ని మరపుకు తెప్పించాయి పొంగిపోయిన అతడి బుగ్గలు.

"చదివి ఏడు!" చెప్పాడు అన్నయ్య.

"మీరే నా మొగుడు" సీరియల్ నవల చదివాడు చంటిబాబు.

ఆ నవలలోని కథానాయకుడు నపుంసకుడు!

ఆ పాత్ర తనని చూసే వ్రాసినట్లుందని, అద్దమని వ్రాశాడు పాపం, చంటిబాబు.

"నా బ్రతుకు 'సుమంగళి' సినిమా హీరో అయిపోయింది, దేవుడోయ్! కథ అర్థం పట్టడం సంగతి దేవుడెరుగు! నా బ్రతుక్కి గ్రహణం, మునురు ఒకేసారి పట్టేశాయి!" ఒక్కసారిగా గొల్లుమన్నాడు ఉత్తర రచయిత చంటిబాబు. ★

## కృష్ణా బారేజి

సంధ్యా సమస్యల చీకటి కాటుక
రేఖలవేళ
రేపటి సుధా ఉషస్సులను స్వప్నించడానికి
నాలుగు కళ్ళూ, రెండు గుండెలూ
నీ అలల మీంచి తేలివచ్చిన గాలుల్లోంచి
ఊహల ఊపిరి బంతులను ఆడుకుంటూ
పదాల అర్థాల్లోంచి అవగాహనల్ని
మనసు కాన్వాస్ మీద ప్రెస్ చేసుకుంటూ,
ఒక వర్ణ చిత్రం కోసం నడిచి వెళ్ళినప్పుడు
కృష్ణవేణీ!
నీ జలధారలు వారికి కొత్త జీవనం ఇస్తాయని
నువ్వూహించావా!
ఆశ నిరాశలకూ, మంచి చెడులకూ
అన్నింటికీ ఒకేలా ప్రవహించే నీ గుండె
ఎవర్ని ఆశీర్వదించి నీ ఒడ్డున
చెరగని నవ్వ పదులతో జీవన మిస్తుందో
మే మూహించామా!

ఇవాళ
నువ్వు నిల్చిన వారధితో
ఆశయాల సారధితో
ఆశల పథంలో జీవనరథం
ఆనందంతో ఉరకలు వేస్తోంది చూడు
ఇవే వారి
అనుభూతుల అనుభవాలు
నిత్య చైతన్య ఉషస్సుల తృష్ణ
జీవితం ప్రవహించే
సదా సుధాతరంగాల కృష్ణ
కృష్ణవేణీ! నీ బారేజ
వసంతంలో ఏకసంధి పెనవేసుకున్న మల్లెజాజి
ప్రదక్షిణ చేసే జీవన హావిన్ను
ఏకత్రితమైన ఎద స్నేహాల
ప్రేమసుధా ఉషస్సు.

-సుధామ